
సాక్షి
కాకినాడ
సోమవారం ౹ 6 ౹ మే ౹ 2024



ఆరు.. ప్రచారం జోరు

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఇక ఆరు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు దూకుడు పెంచారు. - 8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
41.0° / 28.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	28.0
కాకినాడ	39.0	29.0
అమలాపురం	41.0	28.0

న్యూస్‌రీల్

కోరుకొండకు రేపు సీఎం జగన్ రాక



మధురపూడి: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం కోరుకొండ రానున్నారు. ఇక్కడ జరిగే సిద్ధం ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. సభ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం రోడ్డులో మంగళవారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ బహిరంగ సభకు భారీగా ప్రజలు, అభిమానులు తరలిరానున్నారని చెప్పారు. కాపవరం పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న హెలిప్యాడ్‌కు సీఎం జగన్ ఉదయం చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సభాస్థలికి చేరుతారని తెలిపారు. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా కూడా కోరుకొండలో జరిగిన భారీ బహిరంగ సభలో జగన్ పాల్గొన్నారని, లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సభ జరగడంతో మంచి మెజారిటీ వచ్చిందని తెలిపారు. ఈసారి కూడా అదే పునరావృతమవుతుందని ఎమ్మెల్యే రాజా చెప్పారు.

పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక సాధారణ సెలవు

కాకినాడ సిటీ: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఒక రోజు ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు జీఓఆర్టీ నంబర్ 845 జారీ చేసినట్టు చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల అభ్యర్థన మేరకు సంబంధిత అధికారులు ఒక రోజు ప్రత్యేక క్యాజువల్ సెలవును మంజూరు చేయాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు తెలిపారు.

వ్యవసాయం మిన్నగా..

- రైతు ఇంట.. లాభాల పంట
- ఆర్‌బీకేల ఏర్పాటుతో చెంతనే సేవలు
- కూలీల కొరతకు యంత్రాలతో పరిష్కారం
- ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా
- తోడుగా నిలుస్తున్న ఉచిత పంట బీమా



పంట నష్టపరిహారం అంచనా తయారు చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మనది వ్యవసాయ ప్రధానమైన దేశం. మన దేశ ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికీ 60 శాతం మందికి పైగా వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆ తరువాతే పారిశ్రామిక, సేవా రంగాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో అంతటి కీలకమైన వ్యవసాయ రంగాన్ని గత పాలకులు ఎంతో చిన్నచూపు చూసేవారు. స్వయంగా 'పచ్చ' ప్రభుత్వాధినేతే 'వ్యవసాయం దండగ' అని అంటూ.. ఈ రంగంపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. పంట రుణాలు, బంగారు రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామంటూ రైతులను నిట్టనిలువునా మోసగించి, అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పి, నట్టేట ముంచారు. చిట్టచివరకు దేశానికి వెన్నెముకలా నిలిచే రైతన్నల వెన్ను విరిచారు.

ప్రభుత్వం అండగా నిలిచిందిలా..

వ్యవసాయం దండగ అన్న నాటి పాలకుల రీతికి భిన్నంగా.. గడచిన ఐదేళ్లగా సాగును పండగలా మార్చింది ప్రస్తుత ప్రభుత్వం. రైతులను అడుగడుగునా చేయి పట్టి నడిపించింది. ఇందుకు అవసరమైన యంత్రాంగాన్ని పల్లెల్లో రైతుల చెంతనే ఏర్పాటు చేసింది. విత్తు నుంచి.. పంట దిగుబడుల విక్రయాల వరకూ.. గతం కంటే మిన్నగా అన్నదాతలకు సాయం అందించింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించింది. రైతులు తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లిస్తే.. సున్నా వడ్డీ పథకం ద్వారా ప్రభుత్వమే ఆ వడ్డీ చెల్లించి, రైతుపై భారం పడకుండా చూసింది. గ్రామాల్లో కూలీల కొరతను అధిగమించేందుకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీతో యంత్ర పరికరాలను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. వరి నాట్ల యంత్రాలు, వరి కోత మిషన్లు, ట్రాక్టర్లతో పాటు ఇతర పరికరాలను రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వద్ద అందుబాటులో ఉంచింది. తక్కువ అద్దెకే వాటిని అద్దెకు ఇవ్వడంతో రైతులకు అవి ఎంతో ఉపయోగపడ్డాయి. గత పాలకుల హయాంలో రెండు పంటలు మాత్రమే పండేవి. దీనికి భిన్నంగా జూన్ మొదటి వారంలోనే సాగునీరు ఇచ్చి మూడో పంట సైతం సాగు చేసుకునే విధంగా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యల ఫలితంగా రైతులు నేడు అధిక దిగుబడులు సాధిస్తూ.. 'లాభాల పంట' పండించుకుంటున్నారు.

అదే సీజన్‌లో పంట నష్టపరిహారం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు పంట నష్టం ఎప్పుడూ సకాలంలో అందేది కాదు. అది కూడా నాటి అధికార పార్టీ నాయకులకు మాత్రమే వచ్చేది. నాటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రైతులకు సుమారు రూ.250 కోట్ల మేర పంట నష్టపరిహారానికి ఎగనామం పెట్టారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత పంటల బీమా పథకం ప్రవేశపెట్టింది. దీనికిగానూ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. ఏదైనా సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన పంట నష్టం జరిగితే.. అదే సీజన్ ముగియకుండానే పంట నష్టపరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. గడచిన ఐదేళ్లలో రైతులకు పంట నష్టపరిహారంగా ఇవ్వాల్సిన ఒక్క రూపాయి కూడా ఈ ప్రభుత్వం ఎగ్గొట్టకపోవడం గమనార్హం.

ఆర్‌బీకేలతో అన్నదాతకు అండగా..

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లావ్యాప్తంగా 414 ఆర్‌బీకేలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారానే రైతులకు కావాల్సిన విత్తనాలు, నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందజేశారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ఆర్‌బీకేలు ఎంతో తోడ్పడ్డాయి. అంతే కాదు.. గ్రామాల్లో వ్యవసాయ సహాయకులను నియమించి, ఎప్పటికప్పుడు రైతులకు సాగులో అవసరమైన సలహాలు, సూచనలు అందించే ఏర్పాటు చేశారు.

కౌలు రైతులకూ మేలు

కౌలు రైతులు కూడా వ్యవసాయంలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నారు. సాగు చేసుకునేందుకు సొంత భూమి లేకపోయినా.. పెద్ద రైతుల వద్ద కౌలుకు తీసుకుని రకరకాల పంటలు పండిస్తూ బతుకుబండి లాగిస్తున్నారు. అటువంటి కౌలు రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. రైతు భరోసా పథకం కింద ఎస్సీ, ఎస్టీ కౌలు రైతుల ఖాతాల్లో ఏటా రూ.13,500 చొప్పున జమ చేసింది. రైతులకు ఇబ్బందులు లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి, సున్నా వడ్డీ పథకంలో పంట రుణాలు కూడా అందజేసింది. ఈవిధంగా గడచిన ఐదేళ్లలో 2.09 లక్షల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వారికి వివిధ సంక్షేమ పథకాలు అందించింది.

జిల్లాలో రైతులకు ఐదేళ్లుగా లబ్ధి చేకూరిందిలా..

పథకం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ యంత్ర సేవా పథకం	2,431	27.52
వైఎస్సార్ రైతు భరోసా	1,74,229	1,121
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	1,35,353	296
వైఎస్సార్ సున్నా వడ్డీ	73,612	11.24



కరప మండలం పాతర్లగడ్డలోని రైతు భరోసా కేంద్రం

నాడు ఏనాడూ పరిహారం ఇవ్వలేదు



టీడీపీ హయాంలో రైతులకు ఏనాడూ సక్రమంగా పంట నష్టపరిహారం ఇవ్వలేదు. గత ఖరీఫ్‌లో 2.15 ఎకరాల్లో వరి సాగు చేశాను. అధిక వర్షాల కారణంగా పంట నేలకొరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి, పంట నష్టం జరిగినట్లు నమోదు చేశారు. రెండు నెలల్లోనే నా ఖాతాలో రూ.24,232 జమ చేశారు. ఎవ్వరికీ రూపాయి కూడా లంచం ఇవ్వలేదు.

– ఇంటి వెంకటరావు, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

రైతుకు నిజంగా భరోసా



రైతు భరోసా పథకం ద్వారా ఈ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ఐదేళ్లుగా నాకు ఏటా రూ.13,500 చొప్పున క్రమం తప్పకుండా జమయ్యింది. ఈ డబ్బులు పంటల పెట్టుబడికి ఎంతో ఉపయోగపడ్డాయి. రైతు భరోసా లేకపోతే బయటి వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునే వాళ్లం. ఈ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా మేలు చేసింది. దీనిని ఎప్పటికీ మరచిపోలేం.

– తుమ్మల అచ్యుత రామయ్య, రైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

వైఎస్సార్ సీపీకే ఆర్యవైశ్య సంఘం మద్దతు



ఆర్యవైశ్య సమ్మేళనంలో ప్రసంగిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం



సమావేశంలో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, దవులూరి దొరబాబు

- శ్రీఘాకోళ్లపు, మట్టే శ్రీనుబాబు వెల్లడి
- పెద్దాపురంలో ఆత్మీయ సమ్మేళనం

సామర్లకోట: తమ మద్దతు వైఎస్సార్ సీపీకే ఉంటుందని పెద్దాపురం ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. పెద్దాపురం మట్టే ఆదినారాయణ, శ్రీమతి నాగలక్ష్మీ కల్యాణ వేదికలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఆర్యవైశ్యులకు న్యాయం జరుగుతోందని అన్నారు. ఆయన హామీ ఇస్తే తప్పనిసరిగా అమలు చేసి చూపిస్తారని చెప్పారు. చంద్రబాబునాయుడి పాలనను 14 ఏళ్ల పాటు చూశామని, జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కోవిడ్‌లో పోయినా మూడేళ్లలో అనేక అద్భుతమైన సంక్షేమ కార్యక్రమాలను ఎటువంటి అవినీతికీ తావు లేకుండా అమలు చేశారని అన్నారు. అటువంటి నేతకు మరో పర్యాయం ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వడానికి ఆర్యవైశ్య ఆత్మీయ కలయిక ద్వారా మద్దతు తెలియజేస్తున్నామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మట్టే శ్రీనుబాబు మాట్లాడుతూ, స్థానికుడైన దవులూరి దొరబాబుకు వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం వచ్చిందని అన్నారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు స్థానిక పరిస్థితులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందని, వీరిద్దరికీ ఆర్యవైశ్య నాయకుల మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ, కాకినాడ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారిని ప్రోత్సహిస్తానని తెలిపారు. దవులూరి దొరబాబు మాట్లాడుతూ, రాజకీయంగా ఉత్సాహం ఉన్న వారిని ప్రోత్సహిస్తామని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు మట్టే ఆదేష్ బాబు, కంతేటి కాశీ (మండపేట), మట్టే శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాపుగంటి కామేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొరుగు జిల్లాలో ఓటు ఉన్న పోలింగ్ సిబ్బందికి..

- 7, 8 తేదీల్లో పీఆర్ కాలేజీలో పోస్టల్ బ్యాలెట్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్



నివాస్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్

కాకినాడ సిటీ: పొరుగు జిల్లాలో ఓటు హక్కు కలిగి, కాకినాడ జిల్లాలో సాధారణ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఈనెల 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం, అమలాపురం, పి. గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగిన వారు ఈనెల 7వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే కొత్తపేట, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగిన వారు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వినియోగించుకోవాలన్నారు. అలాగే ఈనెల 8 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు నియోజకవర్గాలతో పాటు అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలన్నారు. ఇక తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులు కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లోని ఫెసిలిటేషన్ కేంద్రంలో మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నివాస్ తెలిపారు. అలాగే కాకినాడ జిల్లాలో ఓటు హక్కు కలిగి, పొరుగు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఆయా జిల్లాలో ఆయా తేదీల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ నివాస్ తెలిపారు. ఏ కారణం చేతనైనా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోలేని ఉద్యోగులు తమ ఓటు ఏ నియోజకవర్గంలో ఉందో ఆ నియోజకవర్గం ఆర్వో వద్ద ఈనెల 7, 8 తేదీల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఆంధ్రప్రదేశ్ ఎన్నికల అధికారి ప్రత్యేక వసతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

పేదల ఊపిరి నిలిపేందుకు జగన్ సీఎం కావాలి

కిర్లంపూడి: పేదల ఊపిరి నిలిపేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. కిర్లంపూడి గ్రామానికి చెందిన వివిధ కుల సంఘాల నాయకులు ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును ఆదివారం వారి నివాసంలో కలిశారు. వారినుద్దేశించి ముద్రగడ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా 2019 ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానికంగా చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జగన్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అధికార దాహంతో కూటమి నాయకులు అమలు సాధ్యం కాని మేనిఫెస్టో ప్రకటించి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన వైఎస్ జగన్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని చెప్పారు. ఆ పార్టీ నుంచి కాకినాడ ఎంపీగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తోట నరసింహాన్ని భారీ మెజార్టీతో గెలిపించి, వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని ముద్రగడ అభ్యర్థించారు. రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని తదితరులు కూడా ముద్రగడను మర్యాదపూర్వకంగా కలిశారు.



ముద్రగడను, గిరిబాబును కలసిన కిర్లంపూడి గ్రామస్తులు

వైఎస్సార్ సీపీతోనే బ్రాహ్మణ సంక్షేమం

- బ్రాహ్మణులంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలి
- అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ద్రోణంరాజు రవికుమార్

కాకినాడ రూరల్: బ్రాహ్మణ సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుందని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, వర్షాలు కురవాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండాలని, ఆయనకు బ్రాహ్మణులందరూ అండగా నిలవాలని అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ పిలుపునిచ్చారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్‌లోని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రాహ్మణ సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.780 కోట్లు ఖర్చు చేశారన్నారు. మూడు లక్షల మంది బ్రాహ్మణులకు మంచి జరిగిందన్నారు. చంద్రబాబునాయుడి హయాంలో రూ.250 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ఇప్పటి మాదిరిగానే సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలనే కోరుకుంటున్నామన్నారు. 1983లో టీడీపీ ఆవిర్భావం నుంచి బ్రాహ్మణులు రాజకీయ, ఆర్థిక, సామాజిక తోడ్పాటు లేకుండా బతుకుతున్నారన్నారు. బ్రాహ్మణులకు 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి మూడు ఎమ్మెల్యే, ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారన్నారు. టీడీపీ ఆవిర్భావానికి ముందు 294 మంది ఎమ్మెల్యేల్లో బ్రాహ్మణులు 39 మంది ఉండేవారన్నారు. కూటమి పార్టీలు బ్రాహ్మణులను విస్మరించాయన్నారు. చంద్రబాబు బ్రాహ్మణ సంక్షేమం పట్టించుకోలేదని, బ్రాహ్మణ కార్పొరేషన్ పెట్టామని చెప్పుకునే ఆయన తమను దిగజార్చారని విమర్శించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బ్రాహ్మణులకు, సమాజానికి ఏం చేస్తారో చెప్పాలని, ఆయనకు ఎప్పుడూ ఎదుటి వారిని తిట్టడానికే సరిపోతోందని అన్నారు. గతంలో పవన్ అన్నయ్య చిరంజీవి పాలకొల్లులో మహిళ చేతిలో ఓడిపోయారని, నేడు పిఠాపురంలో పవన్ కూడా అదే పరిస్థితిలో ఉన్నారని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన తమను విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. కాకినాడ రూరల్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబును గెలిపించాలని రవికుమార్ బ్రాహ్మణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘ నాయకులు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సోమసుందరం, సూపర్‌బజార్ డైరెక్టర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. నీ పక్కనే బుకీలు, కబ్జాకోరులు

- కాకినాడ ప్రతిష్ట దెబ్బ తీస్తే ఉపేక్షించను
- చంద్రబాబుపై సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఫైర్

కాకినాడ: ఒకపక్క క్రికెట్ బుకీని, మరోపక్క అవినీతిపరుడిని వెంటేసుకుని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తనపై అభూత కల్పనలతో విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాకినాడ వచ్చిన చంద్రబాబు మరోసారి అబద్ధాల కోరుగా నిరూపించుకున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నంతసేపూ అవినీతిపరునిగా, కబ్జాలకు చిరునామాగా పేరొందిన వనమాడి కొండబాబును ఒకపక్క, క్రికెట్ బెట్టింగుల్లో ఆరితేరాడనే ఆరోపణలున్న జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను మరోపక్క పెట్టుకున్న చంద్రబాబు చేసిన విమర్శలు ఆయన దివాలాకోరు రాజకీయాలకు అద్దం పడుతున్నాయని దుయ్యబట్టారు. రాజకీయాల్లో చంద్రబాబుకు స్థిరత్వం లేదని, 2014లో బీజేపీ, జనసేనతో కలిసి పోటీ చేసి, 2019లో విడివిడిగా వచ్చి, మళ్లీ ఇప్పుడు అవే పార్టీలతో కూటమి కట్టారని అన్నారు. దీనినిబట్టి ఆయన రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారే వ్యక్తిగా అర్థమవుతోందన్నారు. కూటమి భాగస్వామ్య పార్టీగా ఉన్న బీజేపీ.. టీడీపీ మేనిఫెస్టోను ముట్టుకునేందుకు కూడా వెనుకాడటం చూస్తుంటే చంద్రబాబును ఆ పార్టీ నమ్మడం లేదన్న విషయం బహిర్గతమవుతోందని చెప్పారు. వ్యక్తిగతంగా తనపై ఎన్ని ఆరోపణలు చేసినా సమాధానం ఇస్తానని, అంతర్జాతీయంగా ఖ్యాతి కలిగిన కాకినాడ నగర ప్రతిష్ట దెబ్బ తినేలా తప్పుడు ఆరోపణలు చేస్తే మాత్రం ఉపేక్షించబోనని ద్వారంపూడి స్పష్టం చేశారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన వ్యక్తికి కాకినాడ రేవు ద్వారా జరిగే కార్యకలాపాల గురించి కనీస అవగాహన కూడా లేకపోయిందని, రూ.వేల కోట్ల బియ్యం అక్రమ రవాణా అంటూ తప్పుడు విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.



ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కొండబాబు వస్తే అరాచకమే

బ్యాంకుల నుంచి 2014లో జప్తు నోటీసులు అందుకున్న స్థాయి నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు 2019లో ఐదంతస్తుల భవనాన్ని, కోట్ల ఆస్తులను ఎలా కూడబెట్టారని ద్వారంపూడి ప్రశ్నించారు. ఏటిమొగ ప్రాంతంలోని సుమారు 47 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతో కొండబాబుపై కేసు కూడా నడుస్తోందన్నారు. అలాంటి వ్యక్తులను ఎన్నుకుంటే కాకినాడ డ్రగ్స్ మాఫియాకు, దోపిడీదారులకు, పేకాట క్లబ్బులకు, కబ్జాకోరులకు అడ్డాగా మారుతుందని చెప్పారు. ఇటువంటి అభ్యర్థుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటు వేయాలని కోరారు. మత్స్యకారులకు ఓఎన్‌జీసీ నష్టపరిహారం ఇప్పించాలని ఉద్యమిస్తే.. ఆ సమస్యను కూడా తప్పుదారి పట్టించి రూ.1,000 కోట్లు కాజేశానంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో వనమాడి కొండబాబుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నానని చెప్పారు.

జగన్‌ను మళ్లీ గెలిపించండి

ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీ అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఎన్ని కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

చోరీల కేసులో యువకుడి అరెస్ట్


నిందితుడిని హాజరుపరిచిన రైల్వే పోలీసులు

తుని: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని అరెస్ట్ చేసినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై క్రైం పార్టీ గస్తీ కాస్తుంది. ఈ క్రమంలో రైల్వే పరిధిలో నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడు బొక్క రాజా అనే రాజేష్ (27) పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకుని తుని– సామర్లకోట రైల్వే స్టేషన్ల మధ్య పాల్పడిన నేరాలకు సంబంధించి విచారించగా ట్రైన్లలో నిద్రపోతున్న, విండోస్ వద్ద అజాగ్రత్తగా ఉండే ప్రయాణికుల వద్ద దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి 113 గ్రాముల బంగారం, ట్యాబ్, మూడు సెల్ ఫోన్లు, స్కూటీ రికవరీ చేశారు. వీటి విలువ రూ.6.65 లక్షలు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. హెచ్‌సీ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు రామకోటి, ఆదినారాయణ, శివాజీ, ఆర్పీఎఫ్ ఎస్సై సతీష్, హెచ్‌సీ రవి పాల్గొన్నారు.

ఆరు.. ప్రచారం జోరు..

- ప్రచారానికి మిగిలింది ఆరు రోజులే
- దూకుడు పెంచిన అభ్యర్థులు
- విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీల వ్యూహాలు
- ఎండను సైతం లెక్క చేయకుండా పర్యటనలు

కాకినాడ సిటీ: సభలు.. సమావేశాలు.. రోడ్ షోలతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రచారానికి ఇంకా ఆరు రోజులే మిగిలింది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సమయం దగ్గర పడడంతో ఏ మాత్రం వృథా చేయకుండా రోజంతా పర్యటనలతో మునిగితేలుతున్నారు. అగ్రనేతల పర్యటనలతో సైతం మరింత జోష్ వచ్చింది. 42 డిగ్రీల ఎండలను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లి అభ్యర్థులు ఓట్లు అడుగుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో టెన్షన్ మొదలైంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నాయకులు సభలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మధ్యాహ్నం వేళ కొంత విశ్రాంతి ఇచ్చి ఉదయం, సాయంత్రం వేళ జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు తమ ఐదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వివరిస్తూ ప్రచారంలో ముందు ఉంటున్నారు. మిగిలిన పార్టీలకు చెందిన అభ్యర్థులు మాత్రం నామమాత్రంగా ప్రచారం సాగిస్తున్నారు. మొత్తం మీద ఉన్న కొద్ది సమయాన్ని వినియోగించుకుంటూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల్లో పర్యటనతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. దీంతో ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు.

మద్దతు కోరుతూ ముందుకు..

కాకినాడ జిల్లాలో పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచార వేగాన్ని పెంచారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, భార్యలు, కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు సైతం ప్రచారంలో పాలు పంచుకుంటున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో అన్ని గ్రామాల్లో, అన్ని మండలాల్లో పర్యటిస్తూ స్థానిక నేతలందరినీ ప్రచారంలో భాగస్వామ్యం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు, రైతులకు, ఇతర వర్గాలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ అభ్యర్థులు తెలుపుతున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంట్ పరిధిలో, అసెంబ్లీ పరిధిల్లో చేసిన పనులను వివరిస్తున్నారు. మళ్లీ అవకాశం ఇస్తే చేయబోయే పనులకు హామీలు ఇస్తూ ఓటర్ల మద్దతు కూడగట్టుకుంటున్నారు. టీడీపీ, జనసేన నాయకులు కల్లబొల్లి హామీలు, అమలుకాని మేనిఫెస్టోను పట్టుకొని నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నారు. మళ్లీ ప్రజలను మోసపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని అంటున్నారు. చంద్రబాబు ప్రకటించిన పథకాలను ప్రజలు నమ్మక పోవడంతో అభ్యర్థుల్లో ఓటమి భయం పట్టుకుంది. జిల్లాలో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కూడా కాంగ్రెస్ నేతలతో కలసి పర్యటిస్తున్నారు. గతంలో రెండు సార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా చేసినట్లు గుర్తు చేస్తూ గతంలో తనకు ఉన్న క్యాడర్, పార్టీ నేతలను కలుపుకొని సాగుతున్నారు.



వారం రోజులే గడువు

మరో వారంలో అంటే ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలకు 48 గంటల ముందే ప్రచారాన్ని ఆపేయాలనే ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉన్నాయి. దీంతో ఉన్న సమయాన్ని అభ్యర్థులంతా వినియోగించుకుంటున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల వారీగా ప్రచారాలు సాగిస్తున్నారు. తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తమకు అవకాశం ఇస్తే పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. కాకినాడ లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థులైతే పోర్టును అభివృద్ధి చేస్తామని, పోలవరం ప్రాజెక్టు, కాకినాడ మెయిన్ రైల్వే లైన్‌పై చర్చిస్తున్నారు. తమను గెలిపిస్తే ఈ సమస్యలన్నీ పరిష్కరించడంతో పాటు ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి అండగా ఉంటామని ప్రకటిస్తూ ప్రచారంలో ముందుకెళ్తున్నారు. గడిచిన వారం రోజుల్లో ఎండ తీవ్రత కూడా భారీగా పెరిగింది. ఉష్ణోగ్రతలు 42కు చేరుకున్నాయి. ఎండ వేడి పెరిగినా అభ్యర్థులు మాత్రం తమ ప్రచారాన్ని ఆపడం లేదు. పగలంతా ప్రచారం నిర్వహించి రాత్రి వేళ కుల సంఘాలు, గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా నీట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్–2024 ఆదివారం కాకినాడలోని ఏడు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 3,097 మంది విద్యార్థులకు గాను 3,021 మంది హాజరుకాగా 76 మంది గైర్హాజరయ్యారు. ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిబంధనల మేరకు ప్రతి ఒక్క విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి మధ్యాహ్నం 1.30 గంటల తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్ర 5.20 గంటల వరకూ పరీక్ష జరిగింది. కాకినాడ ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్, గ్రీన్‌ఫీల్డ్, అక్షర, శ్రీచైతన్య, సుభాని కేతన్, శరణ్య స్కూల్స్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కో ఆర్డినేటర్ బొంత శేఖర్ తెలిపారు.

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం
చికిత్స పొందుతూ భర్త మృతి

తొండంగి: ఆర్థిక సమస్యల కారణంగా తొండంగి గ్రామంలో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ భర్త మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.వినయ్‌ప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లోకారెడ్డి శ్రీనివాస్ (30), సౌజన్యలకు ఏడాది కిందట వివాహం జరిగింది. ఆర్థిక సమస్యల కారణంగా మనస్తాపం చెందిన వీరు శనివారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సౌజన్య చికిత్స పొందుతోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

- ప్రధాని పర్యటనతో ఆంక్షలు
- జిల్లా ఎస్పీ జగదీష్
- పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలపాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దేశ ప్రధాని మోదీ సోమవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్‌ను అమలు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఓ ప్రకటన విడుదల చేశారు. కడియం మండలం వేమగిరి నేషనల్ హైవే సమీపంలోని ప్రధాని బహిరంగ సభ జరుగుతుందని, ఉదయం 6 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలు విధిగా పాటించాలని ఎస్పీ తెలిపారు.

విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు

- గుండుగొలను వైపు నుంచి వచ్చే వాహనాలు నల్లజర్ల, దేవరపల్లి, గామన్ బ్రిడ్జ్ మీదుగా విశాఖపట్నం వెళ్లాలి.
- తాడేపల్లిగూడెం వైపు వచ్చే వాహనాలు నల్లజర్ల, దేవరపల్లి, గామన్ బ్రిడ్జ్ మీదుగా రావాలి.
- జొన్నాడ వైపు వచ్చే వాహనాలు మండపేట, రామచంద్రపురం, కాకినాడ, కత్తిపూడి మీదుగా వెళ్లాలి.

విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు

- కత్తిపూడి వైపు వచ్చే వాహనాలు పిఠాపురం, కాకినాడ, రామచంద్రపురం, జొన్నాడ మీదుగా విజయవాడ వెళ్లాలి.
- జగ్గంపేట మీదుగా వెళ్లే వాహనాలు సామర్లకోట, కాకినాడ, రామచంద్రపురం, జొన్నాడ మీదుగా రావాలి.

జిల్లా పరిసర ప్రాంతాల్లో వేమగిరి మీదుగా వెళ్లే వాహనాలు

- జీరో పాయింట్ (దివాన్‌చెరువు), గామన్ బ్రిడ్జ్, దేవరపల్లి మీదుగా విజయవాడ వెళ్లాలి.
- జీరో పాయింట్, గామన్ బ్రిడ్జ్, కొవ్వూరు, విజ్జేశ్వరం, పెరవలి, రావులపాలెం మీదుగా విజయవాడ వెళ్లాలి.
- రాజానగరం నుంచి ద్వారపూడి, మండపేట, ఆలమూరు, జొన్నాడ, రావులపాలెం మీదుగా వెళ్లాలి.
- వేమగిరి, ధవళేశ్వరం, ఐఎల్‌టీడీ జంక్షన్, కోటిపల్లి బస్టాండ్ మీదుగా వెళ్లాలి.
- పెరవలి జంక్షన్, సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, కొవ్వూరు, గామన్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలి.
- ఈ ఆంక్షలను వాహనదారులు గమనించాలని ఎస్పీ సూచించారు.

వాహనాల పార్కింగ్ ఇక్కడే..

రాజమహేంద్రవరం వైపు నుంచి సభకు వచ్చే బస్సులకు పార్కింగ్‌ను మంతెన ఆశ్రమం వద్ద, అలాగే అక్కడే కార్లు, ఆటోలు, బైకులకు ఆయా పార్కింగ్ ఏర్పాటు చేశారు. రావులపాలెం వైపు నుంచి వచ్చే బస్సులు, కార్లు, ఆటోలు, బైకులు, వీవీఐపీ పాస్‌లు ఉన్న వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ కల్పించారు. డయాస్ పాస్ ఉన్న లీడర్స్ వాహనాలు మీటింగ్ ప్రాంతం వద్ద వారిని దింపి వేమగిరి సెంటర్ దగ్గరలోని విందు రెస్టారెంట్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి. మధ్యాహ్నం 2 గంటల నుంచి ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ, వేమగిరి జంక్షన్ నుంచి (క్వారీ కెనాల్ రోడ్డు వద్ద ఉన్న పీవీ ఆర్ ఎస్టేట్ వద్దకు) వాహనాలను డైవర్ట్ చేస్తారు.

డబ్బు ఉంటేనే పేదలకు బలం

- వారి అభివృద్ధికి సీఎం జగన్ కృషి
- వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐ వింగ్ సభ్యులు


పిఠాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐ వింగ్ సభ్యులు

పిఠాపురం: పేదలకు డబ్బు చేరితేనే సమాజంలో ఉన్నతికి చేరతారని, జీవితంలో నిలబడడానికి పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా బలపడతారని వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐ వింగ్ సభ్యులు అన్నారు. ఆదివారం పిఠాపురంలో వైఎస్సార్ సీపీ ఎన్ఆర్ఐ వింగ్ చైర్మన్ వెంకట్, సభ్యులు కార్తీక్, బ్రహ్మ, ఐటీ వింగ్ సభ్యుడు మహేష్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదల వద్ద డబ్బు ఉంటే వారు తమ స్వశక్తితో మరింత సంపాదించడానికి ప్రయత్నిస్తారని అన్నారు. డబ్బే లేకుంటే ఎప్పటికీ పేదల్లానే ఉండిపోతున్నారని, వారిలో మార్పు తీసుకురావడం కోసం ప్రయత్నించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. పేదలకు పథకాల ద్వారా ఆర్థిక చేయూత ఇవ్వాలని జగన్ సంకల్పించి, అనేక సంస్కరణలు తీసుకువచ్చి సత్ఫలితాలను సాధించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమంతో తలసరి ఆదాయం భారీగా పెరిగిందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చిన డబ్బుతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని ఎంతో మంది పేదలు ధనికులుగా మారారని వివరించారు. అందుకే మళ్లీ జగన్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గడచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. గత టీడీపీ హయాంలో ఏవిధమైన అభివృద్ధి లేదని, పేదలు పేదల్లానే ఉండిపోయారన్నారు. విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని వారు వివరించారు. చేసిన సంస్కరణలతో గ్రామీణ ప్రాంతాలు కూడా పట్టణాలుగా మారిపోయాయన్నారు. ఎన్నో ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మళ్లీ అధికారం కోసం సాధ్యం కాని హామీలను ఇస్తూ కూటమితో కలసి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి తాము ఇక్కడకు వచ్చి మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని వైఎస్సార్ సీపీ తరఫున ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గ్రామాలను ఇప్పుడు చూస్తుంటే రూపురేఖలే మారిపోయి పట్టణాలను తలపిస్తున్నాయన్నారు. దీనికంతటికీ కారణం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకురావడమే అన్నారు. అవినీతి, అక్రమాలు, రాజకీయాలకు తావు లేకుండా అర్హులకు పథకాలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయన్నారు. అందుకే సీఎం జగన్ ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. పలువురు ఎన్ఆర్ఐ సభ్యులు పాల్గొన్నారు.

పొమ్మనలేక పొగ పెడుతున్నారా..!

- ప్రత్యక్ష రాజకీయాలకు చినరాజప్ప సోదరుడి దూరం
- వర్గ విభేదాలే కారణమంటూ తమ్ముళ్ల గుసగుసలు


నిమ్మకాయల జగ్గయ్యనాయుడు

ఉప్పలగుప్తం: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలన్నీ పోటాపోటీగా ప్రచారాలు నిర్వహిస్తుంటే ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీకి రోజురోజుకూ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వారం రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన నాయకులు వరుస రాజీనామాలు చేయడం, పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండడం వంటి పరిస్థితులు నియోజకవర్గంలో కనిపిస్తున్నాయి. ఒకపక్క 2009 ఎన్నికల నుంచి టీడీపీ టిక్కెట్ ఆశించి నిరాశ చెందిన పరమట శ్యామ్‌కుమార్‌కు ఈ సారీ టిక్కెట్ దక్కకపోవడంతో అసంతృప్తితో స్వతంత్ర (రెబల్) అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇదే క్రమంలో నియోజకవర్గ టీడీపీలో కీలక నాయకుడిగా ఉన్న మండలానికి చెందిన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోదరుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని ప్రకటన చేయడం టీడీపీలో ప్రకంపనలు సృష్టించింది. జగ్గయ్యనాయుడు దూరంగా ఉంటానన్న ప్రకటన వెనుక నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలే కారణమని సమాచారం. పరమట శ్యామ్‌కుమార్ రెబల్‌గా పోటీ చేయడంపై తెర వెనుక తన అన్నయ్యతో పాటు తన ప్రమేయం ఉందన్న గుసగుసలు జగ్గయ్యనాయుడిని కొంచెం బాధించాయి. టీడీపీలో జరుగుతున్న ఈ అనూహ్య పరిణామాలతో తనకు సంబంధం లేదన్న బాధతో రాజకీయాలకు దూరమయ్యారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ తన సోదరుడు చినరాజప్పతోనూ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆనందరావుతోనూ ఎడమోహం పెడమోహంతో ఉంటున్న జగ్గయ్యనాయుడు పొమ్మనకుండానే పొగ పెడుతున్నట్టు ముందుగానే గుర్తించి రాజకీయాలకు దూరంగా ఉంటున్నానన్న మాటతో పరోక్షంగా టీడీపీకి దూరమవుతున్న సంకేతాలను తెలియజేశారు. ఇటీవల అల్లవరం మండలానికి చెందిన టీడీపీ కీలక నాయకుడు అడపా కృష్ణ పార్టీకి రాజీనామా చేసి రెబల్ అభ్యర్థి పరమట శ్యామ్‌కుమార్ పక్కన చేరడం ఆ పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. ఇలా వరుస ప్రతికూల ప్రకటనలతో టీడీపీ అభ్యర్థి ఆనందరావు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

సీఎం జగన్‌కు పెరుగుతున్న ప్రజా బలం


వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక, విప్పర్తి

- ఎంపీ అభ్యర్థి రాపాక, ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి
- బెల్లంపూడిలో 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

పి.గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ ప్రజాబలం పెరుగుతుందని, దీంతో ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుడుతోందని వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఆ పార్టీ నాయకుడు మందపాటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బెల్లంపూడి గ్రామంలో టీడీపీ నుంచి బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన 100 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎంపీ అభ్యర్థి రాపాక, ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనకు ఆకర్షితులమై తాము వైఎస్సార్ సీపీలో చేరినట్టు తెలిపారు. రాపాక, విప్పర్తి మాట్లాడుతూ పార్టీలో చేరిన కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, దొమ్మేటి దుర్గారావు, బండి రమేష్, బండి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారిని ఆదివారం వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. ఉదయం నుంచే వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన 5 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ ప్రసాదం, వసతి గదుల అద్దెలు, పూజా టికెట్లు, విరాళాలు, ఇతర విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.3,08,871 ఆదాయం సమకూరిందని వివరించారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

కిర్లంపూడి: ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై ఆదివారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై ఎస్సై షేక్ జబీర్ కథనం ప్రకారం.. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పోలిశెట్టి సుధాకర్ (53) ఆదివారం తెల్లవారు జామున జగపతినగరం గ్రామ పంచాయతీ పరిధి శివారున చింత చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడు. మృతుడు టెంట్ హౌస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నాలుగేళ్ల కిందట భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న గొడవలతో పెద్దల సమక్షంలో విడిపోయారు. సుధాకర్ ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిస కావడంతో అనారోగ్యం పాలయ్యాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని నల్గొండకు చెందిన వంకర బంగార్రాజు (22) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడని ఏఎస్సై సమర్పణరావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఏడాది మార్చిలో బంగార్రాజుకు వివాహమైంది. వివాహానికి ముందు నుంచి అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ప్రేమలో ఉన్నాడు. ప్రేమించిన అమ్మాయి వద్దకు వెళ్లవద్దని హెచ్చరించినా, పట్టించుకోకపోవడంతో పోలీస్ కేసు పెడతామని తల్లిదండ్రులు హెచ్చరించారు. దానితో మనస్తాపం చెంది ఈ నెల 3న గడ్డి మందు తాగాడు. అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ సత్తిబాబు

రంగంపేట: స్థానిక నల్ల చెరువు వద్ద ఏడీబీ తరోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం... పిఠాపురానికి చెందిన కొల్లు సత్తిబాబు రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా రంగంపేట వద్ద అదుపు తప్పి ఆటో బోల్తా పడిందని, ఈ ప్రమాదంలో క్షతగాత్రుడు సత్తిబాబు కాలికి, నడుముకి తీవ్ర గాయాలయ్యాయి. 108లో పెద్దాపురం ఆసుపత్రికి తరలించారు. ఆటోలో డ్రైవర్ తప్ప ప్రయాణికులు ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది.

వనమాడిపై క్రిమినల్ చర్యలు తీసుకోండి


త్రీ టౌన్ సీఐ భగవాన్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఓఎన్జీసీ ఇచ్చే పరిహారంపై దుష్ప్రచారం
- అవసరమైతే పరువు నష్టం దావా వేస్తా
- పోలీసులకు ద్వారంపూడి ఫిర్యాదు

కాకినాడ: మత్స్యకారులకు దక్కాల్సిన రూ.వెయ్యి కోట్ల ఓఎన్జీసీ పరిహారాన్ని సొంత ఖాతాకు మళ్లించి స్వాహా చేశానంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) చేసిన నిరాధారమైన ఆరోపణలపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పోలీసులను కోరారు. ఈ మేరకు కాకినాడ త్రీటౌన్ సీఐ కృష్ణభగవాన్‌కు పార్టీ ముఖ్య నేతలతో కలసి ఆదివారం ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ, ఓఎన్జీసీ వల్ల నష్టపోతున్న మత్స్యకారులకు నష్టపరిహారం ఇప్పించాలన్న ఉద్దేశంతో పోరాటం చేశానన్నారు. ఈ విషయంలో మత్స్యకారులకు అండగా నిలవాల్సిందిపోయి వారికి రావాల్సిన రూ.వెయ్యి కోట్ల సొమ్మును తన సొంత ఖాతాలకు మళ్లించారంటూ కొండబాబు పదేపదే ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనిపై ఓఎన్జీసీ, మత్స్యశాఖ ఉన్నతాధికారులకు సమాచార హక్కు చట్టం కింద తాను దరఖాస్తు చేశానన్నారు. తన లేఖకు సమాధానమిస్తూ మత్స్యకారులకు పరిహారం నిధులు విడుదల కాలేదని, ఒకవేళ విడుదలైనప్పటికీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు మాత్రమే జమ అవుతుందే తప్ప వ్యక్తిగతంగా వేసే అవకాశం లేదని తెలియజేస్తూ సమాధానమిచ్చారని వివరించారు. దీనినిబట్టి రాజకీయ లబ్ధి కోసం కొండబాబు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. ఒక మత్స్యకార వర్గానికి చెందిన నాయకుడిగా వారి ప్రయోజనాలు కాపాడాల్సింది పోయి, ఆ వర్గానికి నష్టం కలిగించే విధంగా అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. ఎన్నికలపై కూడా ప్రభావం చూపించాలనే ఉద్దేశంతో కొండబాబు పదేపదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న వనమాడిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల అనంతరం ఓఎన్జీసీ నివేదిక రప్పించి, మత్స్యకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని చెప్పారు. కొండబాబుపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల ప్రతి స్పందనను బట్టి అవసరమైతే పరువు నష్టం దావా కూడా వేస్తానని ద్వారంపూడి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్, మాజీ కార్పొరేటర్ భీమరాజు, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మత్స్యకార నాయకులు పంతాడి బ్రహ్మానందం, పలువురు మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.